ఆంగోత్ సత్తెమ్మకు రూ.5 లక్షల చెక్కు అందిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రైతు కుటుంబానికి కేసీఆర్ అండ

- రూ.5 లక్షలు అందించి మాట నిలబెట్టుకున్న బీఆర్ఎస్ అధినేత
- ఆంగోత్ సత్తెమ్మకు చెక్కు అందించిన ఎర్రబెల్లి దయాకర్

దేవరుప్పుల, నవంబర్ 13: నీరుండీ ఇవ్వలేని సర్కారు తీరును ఎండగడుతూ గత యాసంగిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పొలంబాట పట్టారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం ధరావత్ తండా శివారు పచ్చర్లబాయి తండాలో రైతు ఆంగోతు సత్తెమ్మ వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. ఏడెకరాలు నాటు పెట్టగా అంతా ఒక్క తడి దగ్గర ఎండిపోయిందని కేసీఆర్‌కు చూపిస్తూ సత్తెమ్మ బోరున ఏడ్చింది. తన కొడుకు పెండ్లి పెట్టుకున్నామని, పెండ్లి పత్రిక కేసీఆర్ చేతిలో పెట్టింది. చలించిన కేసీఆర్ తానున్నానంటూ భరోసా ఇచ్చారు. తాను రూ.5 లక్షలు దయాకర్‌రావుతో పంపుతానని సత్తెమ్మకు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం.. రూ.5 లక్షల చెక్కును మాజీ మంత్రి ఎర్రబెల్లితో పంపించారు. ఆయన బుధవారం పచ్చర్లబాయి తండాలోని ఆంగోత్ సత్తెమ్మ ఇంటికి వెళ్లి కేసీఆర్ ఇచ్చిన చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. తాను నాలుగు రోజుల క్రితం ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఇంటికి వెళ్లగా.. ఆయనే సత్తెమ్మ విషయం గుర్తుచేసి రూ.5 లక్షల చెక్కు రాసిచ్చి, తన పేరు చెప్పి సత్తెమ్మకు అందించాలని ఆమెతో తెలిపారు. ఈ డబ్బులతో చేసిన అప్పులు తీర్చాలని సూచించారు.

నగరంలో భిక్షాటన చేస్తున్న ఆటో డ్రైవర్లు

ఆటోడ్రైవర్ల భిక్షాటన

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ సర్కార్ మోసపూరిత గ్యారంటీలతో అధికారంలోకి వచ్చి ఆటో డ్రైవర్ల బతుకులను రోడ్డుకీడ్చిందని తెలంగాణ ఆటో జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఇమ్లీ బస్టాండ్, నాచారం ఏరియాలో ఆటో డ్రైవర్లు భిక్షాటన చేశారు. పలువురి దగ్గరికి వెళ్లి సమస్యలను వివరించారు. అనంతరం ఆటో జేఏసీ ప్రతినిధులు హబీబ్, శ్రీనివాస్, పల్లెర్ల రవి, పెంటయ్య, సంతోష్, సాయిలు మాట్లాడుతూ.. బతుకు ఎలాగూ నాశనం చేశారు.. కనీసం భిక్షాటన చేసుకోనివ్వకుండా కాంగ్రెస్ సర్కార్ బెదిరిస్తున్నదని ఆరోపించారు. ఆటో డ్రైవర్ల సహనాన్ని పరీక్షించొద్దని.. తమను అడ్డుకోవాలని చూస్తే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీఎంఎస్ రవిశంకర్ మాట్లాడుతూ.. ఏడాదికి రూ.12వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు ఆ ఊసేలేదని విమర్శించారు. ఆటో డ్రైవర్ల కష్టాలను రవాణా శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని చెప్పారు. 12 రోజుల నిరసనలో భాగంగా తొలిరోజు భిక్షాటన చేపట్టామని తెలిపారు. ఈ నెల 21న మహాధర్నా నిర్వహించబోతున్నామని పేర్కొన్నారు.

వడ్లపై కేర్‌లెస్.. మద్యంపై ఫోకస్

- కల్లాల్లో రైతుల గోస పట్టని సీఎం
- తాగుబోతుల రాష్ట్రంగా చేయాలన్నదే రేవంత్ తాపత్రయం
- సీఎం, మంత్రులు గాలిమోటర్లు దిగి కేంద్రాలు పరిశీలించండి
- పంటే కొంటలేరని రైతులు ధర్నాలు చేస్తుంటే బోనస్ ఇస్తున్నమని రేవంత్ డబ్బా
- మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపాటు
- మర్రిగూడ కొనుగోలు కేంద్రం పరిశీలన

నల్లగొండ జిల్లా మర్రిగూడలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

మర్రిగూడ, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ) : మద్యం అమ్మకాలపై ఫోకస్ పెట్టిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం, వడ్ల కొనుగోళ్లపై కేర్‌లెస్‌గా వ్యవహరిస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. బుధవారం నల్లగొండ జిల్లా మర్రిగూడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో హరీశ్ మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లలో సమస్యలను తెలుసుకున్నారు. ఐకేపీ సిబ్బంది, వ్యవసాయశాఖ ఏఈవో ద్వారా కొనుగోళ్లు, డబ్బుల చెల్లింపులపై సమాచారం అడిగారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం, ముఖ్యమంత్రి, మంత్రుల తీరుపై నిప్పులుచెరిగారు. ఈ ప్రభుత్వానికి మాటలు ఎక్కువ చేతలు తక్కువ అని విమర్శించారు. 'భూమ్మీద తిరిగితే ప్రజలు ఆరు గ్యారెంటీల గురించి అడుగుతారని భయపడి ముఖ్యమంత్రి, మంత్రులు గాలి మోటర్లలో తిరుగుతున్నరు.. మహారాష్ట్రకు పోయి రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నరు. తెలంగాణ రైతులకు రుణమాఫీ చేశామని, వడ్లకు బోనస్ ఇస్తున్నామని చెప్పి అక్కడి ప్రజలను కూడా మోసం చేసే ప్రయత్నం చేస్తున్నరు' అని నిప్పులుచెరిగారు. రాష్ట్రంలో సగం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదని, సన్నాలను కూడా ప్రభుత్వం కొన్న పాపాన పోవడం లేదని, బోనస్ బోగస్సే అయ్యిందని విమర్శలు గుప్పించారు. నిరుడు నల్లగొండ జిల్లాలో 4 లక్షల ఎకరాల్లో వరి సాగయిందని, ఈ సారి కృష్ణానదిలో నీళ్లు పుష్కలంగా ఉండటం వల్ల ఐదున్నర లక్షల ఎకరాల్లో ధాన్యం పండిందని తెలిపారు. ఏడున్నర మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేసినా ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కూడా కొనే పరిస్థితి లేదని చెప్పారు. సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక, గన్నీబ్యాగులు అందించక రైతులను ప్రభుత్వం ఇబ్బంది పెడుతున్నదని చెప్పారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో క్వింటా రూ.1800కే రైతులు దళారులకు అమ్ముకోవాల్సి వచ్చిందన్నారు. రైతులకు ప్రభుత్వం మీద నమ్మకం లేక ఎంతకో అంతకు తెగనమ్ముకుంటునానరని ఆవేదన వ్యక్తంచేశారు.

ఎక్కడ చూసినా రైతుల ధర్నాలు..

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సకాలంలో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని హరీశ్‌రావు చెప్పారు. తేమశాతం సాకు చూపుతూ కొనుగోళ్లు చేయక రైతులను ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. ఇదే అదనుగా పక్క రాష్ట్రాల దళారులు పాగా వేశారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక రకాల కొర్రీలు పెడుతూ రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించుకునేలా చేసిందని మండిపడ్డారు. రాష్ట్రంలో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొంటామని ప్రభుత్వం ప్రకటించినా 40 లక్షల మెట్రిక్ టన్నులు కూడా కొనే పరిస్థితి లేదన్నారు. ఎక్కడ చూసినా రైతులు రోడ్డెక్కి ధర్నాలు, రాస్తారోకోలు చేయాల్సిన పరిస్థితి దాపురించిందని మండిపడ్డారు.

రేవంత్ రాజ్యంలో రైతుకు దుఃఖం

రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని రైతులకు దుఃఖమే మిగిలిందని హరీశ్ వాపోయారు. రైతులకు ఇచ్చిన గ్యారెంటీలు ఒక్కటి కూడా అమలు కాలేదని, పెట్టుబడి పైసలివ్వలేదని, సగం మందికి కూడా రుణమాఫీ చేయలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కరోనా కష్టకాలంలోనూ రూ.72వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారని గుర్తుచేశారు. కొనుగోళ్లలోనే కాకుండా మద్దతు ధర అందించడంలోనూ సర్కారు ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఈ యాసంగి పంటకైనా రైతుభరోసా ఇచ్చి అన్నదాతలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మద్యమే సర్కారు ప్రాధాన్యతా?

తెలంగాణను తాగుబోతుల రాష్ట్రంగా మార్చాలని రేవంత్‌రెడ్డి తాపత్రయపడుతున్నారని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. మద్యం అమ్మకాలపై ఉన్న ప్రేమ రైతులపై లేదని మండిపడ్డారు. తక్కువ మందు అమ్మిన ఎక్సైజ్ అధికారులకు మెమోలు ఇస్తున్నారని, 25 మంది సీఐలపై చర్యలు తీసుకున్నారని తెలిపారు. మరి వడ్లు కొనకపోతే మిల్లర్లను ఎందుకు అడగడం లేదని ప్రశ్నించారు. ఆడబిడ్డలకు ఇచ్చిన హామీల్లో తులం బంగారం, నెలకు రూ.2500 వాగ్దానాలకు ఎగనామం పెట్టారని విమర్శించారు. మద్యం అమ్మకాలను ప్రోత్సహించి మహిళల మెడల్లో పుస్తెల తాళ్లు తెంపేందుకు రేవంత్ యత్నిస్తున్నారని మండిపడ్డారు. కేంద్రం పరిశీలనలో హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జగదీశ్ తదితరులున్నారు.

21, 22 తేదీల్లో రాష్ట్రపతి పర్యటన

హైదరాబాద్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజులపాటు హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. ఈ నెల 21న సాయంత్రం హకీంపేట విమానాశ్రయానికి చేరుకునే ఆమె అక్కడి నుంచి నేరుగా ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే కోటి దీపోత్సవానికి హాజరవుతారు. 22న హైటెక్‌సిటీలోని శిల్పకళావేదికలో 'లోక్ మంతన్-2024' కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై బుధవారం సీఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

వేధింపులు ఆపాలి

- పీఆర్టీయూటీఎస్

హైదరాబాద్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): కుల గణన సర్వేలో పాల్గొంటున్న టీచర్లను కొందరు అధికారులు వేధిస్తున్నారని, తక్షణమే వీటిని ఆపాలని పీఆర్టీయూ టీఎస్ డిమాండ్ చేసింది. సర్వే గడువును ఐదు రోజులు పొడిగించాలని కోరుతూ పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, పుల్గం దామోదర్‌రెడ్డి బుధవారం సీఎస్ శాంతికుమారిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. కొన్ని చోట్ల ఉదయం 7 నుంచి 9 గంటల వరకు, సెలవులు దినాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సర్వే డ్యూటీల్లో ఉండాలని అధికారులు ఆదేశిస్తున్నారని, ఇది సరికాదని చెప్పారు. ఒక్కొక్కరికి 150 గృహాలిస్తామని, అంత కన్నా ఎక్కువగా ఇచ్చారని తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని, 15 కార్తీక పౌర్ణమి సందర్భంగా సెలవు మంజూరుచేయాలని, అత్యవసర, ఆరోగ్యరీత్యా సెలవు పెట్టుకునే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

మాలాగే మీరూ మోసపోకండి

- కాంగ్రెస్ హామీలను నమ్మకండి
- మహారాష్ట్రలో తెలంగాణ వాసుల వినూత్న ప్రచారం

హైదరాబాద్, ఆదిలాబాద్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): 'కాంగ్రెస్ పార్టీని నమ్మి మేము మోసపోయాం.. మీరు మోసపోకండి' అంటూ ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం ఇచ్చోడ మండలంలోని ముక్రా (కే) గ్రామస్థులు మహారాష్ట్రలో ప్రచారాన్ని చేపట్టారు. ముక్రా(కే) మాజీ సర్పంచ్ మీనాక్షి గాడ్గే, మాజీ ఎంపీటీసీ సుభాష్‌తోపాటు స్థానికులు బుధవారం కిన్వట్ నియోజకవర్గంలోని పాటోదా, ఇంజెగామ్ గ్రామాల్లో పర్యటించారు. తెలంగాణలో కాంగ్రెస్ ఎన్నికల హామీలను ఇచ్చి ఏవిధంగా మోసం చేసిందో వివరించారు. రైతు భరోసా, రుణమాఫీ, మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు రూ.2,500, తులం బంగారం, పంటలకు బోనస్ తదితర హామీల పరిస్థితిని ప్రజల దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు కావస్తున్నా గ్యారెంటీలు అమలుకావడంలేదని ప్రజలకు వివరించారు. హామీలన్నీ అమలు చేశామంటూ సీఎం రేవంత్‌రెడ్డి మహారాష్ట్రలో అబద్ధాలు చెప్తున్నారని ప్రజలకు వివరిస్తున్నారు. మహారాష్ట్ర ప్రజలు కూడా ఐదు గ్యారెంటీలని నమ్మి ఓటు వేసి మోసపోవద్దని కోరారు.

మహారాష్ట్రలోని కిన్వట్ నియోజకవర్గం పాటోదాలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న ముక్రా(కే) మాజీ సర్పంచ్ మీనాక్షి, మాజీ ఎంపీటీసీ సుభాష్

మేఘా సంస్థను సీజ్ చేయాలి

- హామీల అమలులో రేవంత్ సర్కారు విఫలం
- మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, నవంబర్ 13 : ప్రాజెక్టుల పనుల్లో అవినీతికి పాల్పడుతున్న మేఘా సంస్థను వెంటనే సీజ్ చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ మేఘా సంస్థను బ్లాక్‌లిస్టులో పెట్టాలని కోరారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో రూ.5 వేల కోట్లకుపైగా అవినీతికి పాల్పడిన మేఘా కంపెనీకే తిరిగి నారాయణపేట, మక్తల్, కొడంగల్ ప్యాకేజీ పనులను ఎందుకు కట్టబెట్టారని ప్రశ్నించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాను ఏదో చేస్తారని ప్రజలు నమ్మారని, కానీ ప్రాజెక్టుల విషయంలోనే మీ పనితనం బయటపడిందని రేవంత్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగ్ నివేదికపై గత నెలలో సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు లేఖల ద్వారా ఫిర్యాదు చేసినట్టు సదరు ప్రతులను మీడియాకు చూపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పోస్టల్ పార్సిల్ బుకింగ్ వేళలు పొడిగింపు

- ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు సేవలు
- ప్రకటించిన హైదరాబాద్ చీఫ్ పోస్ట్‌మాస్టర్

హైదరాబాద్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో స్పీడ్ పోస్టులు, రిజిస్టర్డ్ లెటర్స్, పార్సిళ్లు పంపించే సమయాన్ని పొడిగించినట్టు చీఫ్ పోస్ట్‌మాస్టర్ ప్రకటించారు. వినియోగదారుల సౌకర్యార్థం పార్సిల్ బుకింగ్స్ ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగించనున్నట్టు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఆఫీస్ పనివేళలు పూర్తయిన తర్వాత కూడా 4కేజీల బరువు వరకు గల పార్సిళ్లను పంపించేందుకు హైదరాబాద్ జీపీవోలో రోజంతా అనుమతిస్తామని తెలిపారు.

నిజామాబాద్ జిల్లా బీర్కూర్-పోతంగల్ ప్రధాన రహదారిపై బైఠాయించిన కల్లూరు రైతులు

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం గోపన్‌పల్లి వద్ద ట్రాక్టర్‌కు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను ఉంచి రోడ్డుపై బైఠాయించిన రైతులు

అన్నదాతల ఆక్రోశం

ధాన్యం కొనాలంటూ రోడ్డెక్కి ఆందోళనలు • సీఎం రేవంత్ దిష్టిబొమ్మలతో నిరసనలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్,నవంబర్ 13: ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం పలుచోట్ల రైతులు ఆందోళనకు దిగారు. మహబూబ్‌నగర్ జిల్లా గోపన్‌పల్లి శివారులోని కొనుగోలు కేంద్రం వద్ద రైతులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను పెట్టి నిరసన తెలిపారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం తొనిగండ్ల, ఝాన్సీలింగాపూర్ గ్రామాల్లో రైతులు ధర్నా చేపట్టారు. నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం కల్లూర్ రైతులు బీర్కూర్-పోతంగల్ ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం అన్నాసాగర్‌లోని కొనుగోలు కేంద్రంలో సన్నరకం వడ్లను కొనకపోవడం, మిల్లర్లు తరుగు తీస్తుండడంపై నిరసన వ్యక్తంచేశారు. కలెక్టర్ విక్టర్, అధికారులు వచ్చి సన్నధాన్యం కొనుగోలుతోపాటు కాంటాలు వేయడం ప్రారంభించడంతో రైతులు శాంతించారు. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం శెట్టిపాలెం సమీపంలోని మిల్లుల వద్ద కొనుగోళ్లు నిలిపివేయడంతో అన్నదాతలు రోడ్డెక్కారు. లక్ష్మీగణపతి మిల్లుల్లో ధాన్యం లోడ్‌లను తీసుకోకపోవడంతో రైతులు అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై రాస్తారోకో చేశారు. పోలీసులు రైతులకు నచ్చజెప్పి మిల్లు యాజమాన్యంతో మాట్లాడడంతో రైతులు శాంతించారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో చెనగాని సైదులు ధాన్యం లోడు ట్రాక్టర్‌ను రోడ్డుకు అడ్డంగా పెట్టి నిరసన తెలిపాడు. ట్రాఫిక్ జామవడంతో సంబంధిత అధికారులు ఐకేపీ సెంటర్‌లో ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించడంతో నెమ్మదించాడు.

మెదక్ జిల్లా తొనిగండ్ల వద్ద మెదక్-సిద్దిపేట రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

సూర్యాపేటలో భారీ వర్షం.. తడిసిన ధాన్యం

సూర్యాపేట జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. మార్కెట్‌లో ధాన్యం కాంటాలు కాకపోవడంతో ఒక్కసారిగా వచ్చిన వర్షంతో ధాన్యం తడిసి ముద్దయ్యింది. రైతులు ఇబ్బంది పడ్డారు.

తప్పు మాది కాదు.. మిల్లర్లది

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నీలగిరి, నవంబర్13 : ధాన్యం కొనుగోళ్లలో తప్పు ప్రభుత్వానిది కాదని.. మిల్లర్లది అని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లాలో రైస్ మిల్లర్లు కొంతమంది అక్రమాలకు పాల్పడి బ్లాక్ దందాలకు బరితెగించడంతోనే ధాన్యం కొనుగోళ్లలో జాప్యం ఏర్పడిందని, వారం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేస్తామని తెలిపారు. మిల్లర్లు బ్లాక్ మార్కెట్ చేస్తూ రైతులను మోసం చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని, రైతులను ఇబ్బందులను గురి చేస్తే ఎస్-1 కేసులు పెడతామని హెచ్చరించారు. రాష్ట్రంలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు, ముగ్గురు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ పత్తికి గిట్టుబాటు ధర ఇప్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏబీ స్విచ్‌కు తాళం

సరిపడా కరెంట్ రావడం లేదని రైతు నిరసన • 24 గంటలు గడిచినా పరిష్కరించలేదని ధ్వజం

అచ్చంపేట రూరల్, నవంబర్ 13: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం సింగారంనకు చెందిన రైతు రాత్లావత్ శక్రునాయక్‌కు రెండెకరాల పొలం ఉన్నది. మరో రెండెకరాలు కౌలుకు తీసుకొని నాలుగెకరాల్లో వేరుశనగ పంట సాగు చేశాడు. లోవోల్టేజీతో మోటర్ నడవడం లేదని లైన్‌మన్ శంకర్‌కు సమాచారం అందించాడు. ఆయన జూనియర్ లైన్‌మన్ సీతారాంను పంపించగా.. సమస్య పరిష్కరించలేదు. దీంతో సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఏబీ స్విచ్ ఆఫ్ చేసి తాళం వేశాడు. తాళం వేసి 24 గంటలు గడిచినా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని 70 ఎకరాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది.

అచ్చంపేట మండలం సింగారంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు వేసిన తాళం

కొండా సురేఖపై పరువు నష్టం కేసులో.. సాక్షుల వాంగ్మూలం నమోదు

- మంత్రి వ్యాఖ్యలు సబబు కాదు: సత్యవతి రాథోడ్
- కేసు విచారణ 20కి వాయిదా

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): మంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన పరువు నష్టం దావాలో ముగ్గురు సాక్షులు బుధవారం ప్రజాప్రతినిధుల కోర్టులో తమ వాంగ్మూలం ఇచ్చారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, జడ్పీ చైర్మన్ తుల ఉమ, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వాంగ్మూలాలను కోర్టు రికార్డు చేసింది. ఈ కేసులో ఉన్న నలుగురు సాక్షుల వాంగ్మూలం రికార్డు కావడంతో ఈ నెల 20న విచారణ కొనసాగుతుందని కోర్టు సూచించింది. అనంతరం సత్యవతి రాథోడ్ మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళా మంత్రి కొండా సురేఖ కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలు సబబు కావని, ఆయన పరువుకు భంగం కలిగించే విధంగా ఆమె వ్యాఖ్యలు టీవీల్లో ప్రసారమయ్యాయని కోర్టుకిచ్చిన వాంగ్మూలంలో తెలిపినట్టు వివరించారు. బాల్క సుమన్ మాట్లాడుతూ.. అక్టోబర్ 2న మంత్రి కొండా సురేఖ మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలు టీవీల్లో ప్రసారమయ్యాయని, అది చూసి మనస్సు చలించిపోయిందని చెప్పారు. వెంటనే కేటీఆర్‌కు ఫోన్ చేసి టీవీల్లో ప్రసామవుతున్న వార్తల గురించి తెలిపానన్నారు.

నాగార్జున కేసులో..

మంత్రి సురేఖపై సినీ నటుడు నాగార్జున వేసిన పరువునష్టం కేసులో ఆమె తరపు న్యాయవాది కోర్టుకు కౌంటర్ సమర్పించారు. కొండా మాట్లాడిన అంశాల వల్ల అక్కినేని కుటుంబానికి, నాగార్జునకు పరువు నష్టం వాటిల్లలేదని పేర్కొన్నారు. కౌంటర్‌కు సంబంధించిన విచారణను ఈ నెల 21కి వాయిదా వేస్తూ ప్రజాప్రతినిధుల కోర్టు మేజిస్ట్రేట్ శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా హైదరాబాద్ సివిల్ కోర్టులో కేటీఆర్ దాఖలు చేసిన రూ.100 కోట్ల పరువునష్టం కేసులో సైతం కొండా సురేఖ తరపున వకాలత్ దాఖలు చేసినట్టు న్యాయవాది తెలిపారు.

జీవోలు తెలుగులో ఎందుకు ఇవ్వడం లేదు?

- వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు
- 30 ఏండ్ల నాటి జీవో మీద పిల్ వేయడంపై అసహనం

హైదరాబాద్, నవంబర్ 13, (నమస్తే తెలంగాణ): జీవోలు, ఆర్డినెన్స్‌లు తెలుగులో ఎందుకు ఇవ్వడం లేదో వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. జీవోలు, ఆర్డినెన్స్‌లను తెలుగులో జారీ చేయకపోవడం అధికార భాషల చట్టం-1956తో పాటు పలు జీవోలకు విరుద్ధమని శేరిలింగంపల్లికి చెందిన జీ ఉమామహేశ్వరరావు దాఖలు చేసిన పిల్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం బుధవారం విచారించింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదిస్తూ, ప్రభుత్వ ఉత్తర్వులన్నీ ఇంగ్లీషులోనే ఉంటున్నాయన్నారు. సామాన్య ప్రజలకు ఏమీ తెలియక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో తెలుగు మాట్లాడేవాళ్లు 70 శాతం ఉన్నారని, మిగిలిన 30 శాతం మందికి కూడా పూర్తిగా ఇంగ్లిష్ రాదన్నారు. జీవోలు తెలుగులోనే ఉండాలంటూ 1980లో వెలువడిన జీవోను ఇప్పుడు సవాల్ చేయడం ఏమిటని పిటిషనర్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. గత 30 ఏండ్లుగా ఇంగ్లిష్‌లో వెలువడే జీవోల వల్ల జనం ఇబ్బందులు పడుతున్నట్టు పిల్‌లో లేదని చెప్పింది. పిటిషనర్ వయసు 72 ఏళ్లని, ఈ వయసులో ప్రచారం కోసం పిల్స్ వేయరాదని వ్యాఖ్యానించింది. పిటిషన్‌ను విచారణకు స్వీకరించే అంశంపై ప్రభుత్వ వివరణ కోసం నోటీసులు జారీ చేసింది.

తెలంగాణలో 15 శాతం కమీషన్ పాలన

- కేంద్రసహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపణలు

హైదరాబాద్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో 'కమీషన్ల' పాలన కొనసాగుతున్నదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. ప్రతి పనిలో, కాంట్రాక్టుల్లో 15 శాతం కమీషన్ తీసుకుంటూ తెలంగాణను లూటీ చేస్తున్నారని అన్నారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా బండి సంజయ్ బుధవారం నాగపూర్‌లో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీని కూడా ఇప్పటి వరకు పూర్తిగా అమలు చేయలేదని, అయినా తాము అన్ని హామీలు అమలు చేస్తున్నట్లుగా మహారాష్ట్ర ఎన్నికల్లో కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి యాడ్స్ ఇస్తూ మోసం చేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు.